ప్రజాశక్తి

సోమవారం 15 డిసెంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఉపాధ్యాయులపై

'టెట్' పిడుగు

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-బాపట్ల

సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ప్రకారం ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ అర్హత కలిగి ఉండాలని, ఈ తీర్పు లక్షమంది ఉపాధ్యాయులపై ప్రభావం చూపనుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుతో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత సమస్యగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వెంటనే రిట్ పిటిషన్ వేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ 2009 క్లాజ్ 23(2)కి సవరణ చేసే విధంగా ప్రతిపాదనలు పంపాలని డిమాండ్ చేశారు. తీర్పు వచ్చి మూడు నెలలు గడుస్తున్నా ప్రతిపాదనలు న్యాయ శాఖ వద్ద పరిశీలన దశలో ఉన్నాయని, ప్రభుత్వ చర్యలు వేగవంతంగా ఉండాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులందరూ చట్టానికి సవరణ చేసే వరకు పోరాటానికి సిద్ధపడాలని సూచించారు. మంత్రి నారా లోకేష్ ఈ సమస్యపై వెంటనే దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారనున్నదన్నారు. భవిష్యత్తులో వేల పాఠశాలలు మూతపడే పరిస్థితులు దగ్గరగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ బోధనేతర పనుల వలన విద్యార్థులకు బోధన సమయం కుంటుబడుతున్నదన్నారు. పిటిఎం సమావేశాలు పిల్లలకు ఉపయోగపడే విధంగా ఉండాలే గాని ప్రచార ఆర్భాటంగా ఉండకూడదన్నారు. పాఠశాలలు ప్రయోగశాలలుగా మారుతున్నాయని, విద్యార్థుల ప్రగతికి దోహదపడే విధంగా విధానాలు ఉండాలని ప్రభుత్వానికి సూచించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు

▶ 2లో



యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

మట్టి అక్రమ తవ్వకం తప్పు..

పొంచి ఉన్న ముప్పు

విద్యుత్ టవర్ల భద్రతకు పెద్ద ప్రమాదం

ప్రజాశక్తి-మార్కాపురం

మట్టి కోసం తీస్తున్న గోతులు ముప్పు తెచ్చిపెడుతున్నాయి. ఎక్కడబడితే అక్కడ అడ్డగోలుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అత్యంత విలువైన నేషనల్ పవర్ గ్రిడ్‌కు చెందిన 400 కెవి విద్యుత్ టవర్‌లను ఆనుకుని తీసిన గోతులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు తెచ్చిపెడతాయోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మార్కాపురం మండలంలోని చింతకుంట-ఎల్‌బిఎస్ నగర్ మధ్య భాగాన గల కొండ ప్రాంతంలో నేషనల్ పవర్ గ్రిడ్‌కు చెందిన 400 కెవి విద్యుత్ లైన్ నిర్మించారు. నాగార్జునసాగర్‌లో ఉత్పత్తి అయిన విద్యుత్ ఇదే లైన్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దక్షిణాదిలోని కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడుకు రాష్ట్రాలకు కడప మీదుగా విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. విద్యుత్ సరఫరా కోసం 400 కెవి లైన్ కోసం నిర్మించిన ఒక్కో విద్యుత్ టవర్ నిర్మాణానికి రూ.50 లక్షలు వెచ్చించారు. ఈ టవర్ పటిష్టంగా ఉండేందుకు సుమారు 30 అడుగుల లోతున పునాదులు తీసి బలమైన కాంక్రీటుతో నిర్మించడం జరిగింది. భారీ వర్షాల సమయంలో పెను గాలులను సైతం తట్టుకునేందుకు పటిష్టంగా నిర్మిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్ల కోసం, భవన నిర్మాణ సమయంలో పునాదులు పూడ్చుకునేందుకు కొండ ప్రాంతంలో గలుగు మట్టి అవసరం. ఇదే కొండ మట్టిని రహదారులకు ఉపయోగిస్తుంటారు. కొండ ప్రాంతంలో ఎవ్వరూ

▶ 2లో



టవరు ఆనుకుని మట్టి కోసం తవ్విన గుంత

భార్యను చంపి.. బైకుపై తెచ్చి..

వ్యక్తి కిరాతకం ◆ రొంపిచెర్ల వద్ద ఘటన

ప్రజాశక్తి-సంతమాగులూరు

కట్టుకున్న భార్యను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన భర్తే కాలయముడయ్యాడు. మానవ మృగంలా మారి మట్టుబెట్టాడు. ఆపై మృతదేహాన్ని బైక్‌పై పోలీసు స్టేషన్‌కు తెచ్చి లొంగిపోయాడు. పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం మాచవరం గ్రామ పరిధిలో మహిళ దారుణ హత్య ఘటన ఆదివారం కలకలం రేపింది.

బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన అల్లడి వెంకటేష్‌కు మాచవరం గ్రామానికి చెందిన మహాలక్ష్మికి(28) తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. వెంకటేష్ బేకరీలో పనిచేస్తూ ఉంటాడు. వివాహమైన నాటి నుంచే వెంకటేష్‌తో పాటు అతని అక్కలు రమణ, శబరి, తన అన్న శ్రీను మహాలక్ష్మిని వేధింపులకు గురి చేస్తూ వచ్చారని మహాలక్ష్మి తన తల్లికి తెలియజేసినట్లు సమాచారం. భర్త వెంకటేష్ అతని కుటుంబ సభ్యులు వేధింపులు తట్టుకోలేక మహాలక్ష్మి రెండు నెలల క్రితం తన పుట్టినిల్లు అయిన మాచవరం తన తల్లి దగ్గరికి చేరింది. వెంకటేష్ గత శనివారం రాత్రికి మాచవరం గ్రామంలో ఉంటున్న తన భార్య మహాలక్ష్మి దగ్గరికి వెళ్లాడు. పిల్లలకు బంగారం కొన్నానని, తన పద్ధతి మార్చుకున్నానని తిరిగి ఏల్చూరు మన ఇంటికి వెళదామని భార్యకు నచ్చ చెప్పాడు. ఆదివారం ఉదయం ఐదు గంటల సమయంలో తన భార్య అయిన మహాలక్ష్మిని తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని రొంపిచర్ల గ్రామ సమీపాన ఉన్న ఎన్ఎస్‌పి కాలువ సమీపంలోకి రాగానే మహాలక్ష్మిని బైక్ మీద నుంచి కింద పడవేసి ఆమె ధరించిన చలి కోటును లేస్‌తో మెడ భాగం బిగించి దారుణంగా హత్య చేశాడని పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై వేసుకొని సంతమాగులూరు పోలీస్ స్టేషన్ కు చేరుకున్నాడు. తన భార్యను తానే హత్య చేశానని, అక్కడ పోలీసులకు తెలిపాడు. పోలీసులు మృతురాలు బతికి ఉండవచ్చునని భావించి ఆమెను సంతమాగులూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం నిందితుడు అల్లడి వెంకటేష్ రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ ఘటనపై రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతిచెందిన అల్లడి మహాలక్ష్మి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణలో..

ప్రభుత్వం వెనక్కి తగ్గదా?

ప్రజాశక్తి-మార్కాపురం

మెడికల్ కాలేజీల నిర్వహణ ప్రభుత్వ ఆధీనంలో కొనసాగాలనేది అన్ని వర్గాల ఆకాంక్ష. ప్రైవేటీకరణపై ప్రజల్లో సానుకూలత లేదు. ప్రభుత్వం మాత్రం మొండిగా వ్యవహరిస్తోంది. ఆందోళనలు కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.

వైద్య రంగంలో అంత్యంత వెనుకబడిన మార్కాపురం లాంటి ప్రాంతాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ అవసరం. వైద్య విద్యతో పాటు మెరుగైన వైద్యం నిరంతరం అందుబాటులో ఉండాలి. ఈ ప్రాంత వైద్యరంగ పరిస్థితులను పసిగట్టిన గత ప్రభుత్వం మెడికల్ కళాశాలను రూ.473 కోట్లతో మంజూరు చేసింది. మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద 52 ఎకరాల్లో జాతీయ రహదారి-565ను ఆనుకుని నిర్మాణ పనులు అప్పట్లో మొదలయ్యాయి. మెడికల్ కాలేజీలో వైద్యశాల మాత్రమే పునాది దశ దాటింది. మెడికల్ కాలేజీ, హాస్టల్ భవనాలు, మెడికల్ కాలేజీకి అవసరమైన అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ భవనాలు 80 శాతం, 60 శాతం మేర పూర్తయ్యాయి. మొత్తంగా 50 శాతం మేర పనులు జరిగాయి. మెడికల్ కాలేజీ పూర్తయితే మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని ఇక్కడి ప్రజలు ఆశ పడ్డారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. స్వలాభమో ఏమో తెలియదు కానీ.. రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ శక్తులకు అప్పగించే నిర్ణయం తీసుకుంది. అందులో ముందు వరసలో మార్కాపురం మెడికల్ కాలేజీ ఉంది. మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచింది.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదని సిపిఎం, సిపిఐ పార్టీలు ఉద్యమించాయి. వైసిపి నిరంత ఉద్యమంగా కోటి సంతకాల సేకరణ చేపట్టింది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనకు జనంలో ఆదరణ లభించింది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో ఉచిత వైద్యం, ఉచిత వైద్య విద్య మాయం అవుతుందని జనం గగ్గోలు పెడుతున్నా.. చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా ఉంది. టిడిపి శ్రేణులు సైతం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరికాదని బహిరంగంగా వ్యాఖ్యానించడం గమనార్హం.

పిపిపి విధానం...

పేద, మధ్య తరగతి ప్రజలకు నష్టమే...

పిపిపి విధానం అంటే... పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్. దీని అర్థం 'ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం' అన్నమాట.

▶ 2లో



మార్కాపురంలో అర్ధాంతరంగా నిర్మాణం నిలిచిన మెడికల్ కాలేజీ

ఉపాధ్యాయులపై 'టెట్' పిడుగు

(మొదటిపేజీ తరువాయి)

ఎప్పటికీ చెల్లిస్తారో చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయాలతో ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాఠశాల విద్యలో తెస్తున్న సంస్కరణలు విద్యార్థుల స్థాయిని పెంచే విధంగా ఉండాలే గాని అవి విద్యార్థులకు ఉపాధ్యాయులకు సమస్యగా మారకూడదని తెలియజేశారు. పదో తరగతి విద్యార్థుల 100 రోజులు యాక్షన్ ప్లాన్ అమలులో సెలవు రోజులలో మినహాయించే విధంగా అవకాశం కల్పించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలిపామని చెప్పారు. ఈ కౌన్సిల్లో పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని, టెట్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం శ్రద్ధ చూపాలని, హెల్త్ కార్డులు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలనే తీర్మానాలను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. ఈ కౌన్సిల్‌లో 2025-26 యేడాదికి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ..




వినయ్‌కుమార్, శ్రీనివాసరావు

అధ్యక్షులుగా జె వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అడుగుల శ్రీనివాస రావు, గౌరవ అధ్యక్షులుగా కందిమల్ల రవిబాబు, సహాధ్యక్షులుగా ఎంబి సుబ్రహ్మణ్యం, బి పద్మ, కోశాధికారిగా ఎం వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు జిల్లా కార్యదర్శి, ఆడిట్ కమిటీ సభ్యులు రాష్ట్ర కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కెపి ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు పాపారావు, భిక్షాలు బాబు, భవనం శ్రీనివాసరెడ్డి, శాంతారావు, వినోద్‌బాబు, హరిప్రియ, రావి పద్మావతి, విజయలక్ష్మి, సత్యనారాయణ, రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణలో..

ప్రభుత్వం వెనక్కి తగ్గదా?

(మొదటిపేజీ తరువాయి)

మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసిన తరువాత జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం 80 శాతం పడకలు పేషెంట్లతో నిండే వరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేటు మెడికల్ కాలేజీ నిర్వహణా సంస్థ ఆధీనంలో ఉంటాయి. ఆ మేరకు ప్రభుత్వమే ప్రైవేటు సంస్థతో లిఖితపూర్వకంగా ఒప్పందం కుదుర్చు కుంటుంది. ఇన్ పేషెంట్లకు అయ్యే వైద్య చికిత్స లేదా శస్త్ర చికిత్సల బిల్లులను ఆరోగ్యశ్రీ/ సీజీహెచ్/పీఎంజేవై (ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన) రేట్ల ప్రకారం ప్రభుత్వమే ప్రైవేటు సంస్థకు చెల్లించాల్సి ఉంది. ప్రతి మూడేళ్లకోసారి డయాగ్నోస్టిక్ ఛార్జీల రేట్లు, రెండేళ్లకోసారి మిగిలిన అన్నిరకాల వైద్య చికిత్స, శస్త్ర చికిత్సల ఛార్జీలను పెంచుకుం టారు. ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారికి మాత్రమే ఉచిత వైద్యం చేయబడుతుంది. అందుకు ముందుగా ప్రభుత్వ అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంది. రక్తపరీక్షలు, పాథాలజీ, రేడియాలజీ వంటి పరీక్షలకు ఛార్జీలు తప్పనిసరిగా చెల్లించాల్సి వుంది. ఔట్ పేషెంట్స్ (ఓపీ)లకు మాత్రమే ఉచిత వైద్యం చేస్తారు. జనరిక్ మందులను మాత్రమే ఉచితంగా ఇవ్వాలి. మిగిలిన మందులు కొనుగోలు చేయాల్సిందే. మెడికల్ కాలేజీతో పాటు నర్సింగ్, పారా మెడికల్, ఇతర అనేకరకాల అనుబంధ మెడికల్ ట్రైనింగ్ కాలేజీలను ప్రైవేటు నిర్వహణా సంస్థ నెలకొల్పుకునేందుకు అనుమతి ఉంటుంది. మెడికల్ సీట్ల ఫీజులు ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నా కూడా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయడమంటే... ఆపద సమయంలో ప్రభుత్వ అనుమతి పొందటం అందరికీ సాధ్యమా? సకాలంలో ఆ అనుమతి పొందడంలో తలవని తలంపుగా ఆలస్యమే జరిగితే.. రోగి ఆరోగ్య పరిస్థితి విషమించే ప్రమాదం ఉంటుంది కదా! అలాంటప్పుడు ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారికి ఉండే భరోసా చివరకు ఏమవుతుందో ఆలోచించాలి. ఇలా ఆలోచిస్తుంటే బోలెడన్ని సమస్యలు, సందేహాలు, అనుమానాలు, భయాందోళనల సమాహారంగా నిలుస్తుంది ఈ పీపీపీ షరతుల విధానం. ఏది ఏమైనా.. ఇది పేదలకు వైద్యం బాధ్యతల నుంచి ప్రభుత్వం నేరుగా తప్పుకోవడమే అవుతుంది. పేద, మధ్య తరగతి ప్రజలు వైద్యం కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విషయంలో ప్రజా వ్యతిరేకతను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉంది.

గ్రీన్ - బ్లూ - గ్రే హైడ్రోజన్ల..

ఉత్పత్తి పెంపుపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత 5 సంవత్సరాలలో గ్రీన్, బ్లూ, గ్రే హైడ్రోజన్ల ఉత్పత్తి పెంపుపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర నూతన, పునరుత్పాదక శక్తి, విద్యుత్ సహాయక మంత్రి శ్రీపాద్ ఎస్సో నాయక్ సమాధానమిస్తూ గ్యాస్ నుంచి ఉత్పత్తి చేసేదే గ్రీన్ హైడ్రోజెన్ అని, గాలి, సౌర శక్తి, జల విద్యుత్, పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించి ఉత్పత్తి చేస్తారన్నారు. శక్తి నిల్వ, రవాణ, వివిధ రసాయన ప్రక్రియలకు ఉపయోగిస్తారని తెలిపారు. మిగతా రకాల హైడ్రోజన్ల కన్నా ఇది ఎక్కువ సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ నివేదిక ప్రకారం దేశంలో సాలీనా 6.5 మిలియన్ మెట్రిక్ టన్నుల హైడ్రోజన్ ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నారు. దేశం మొత్తంలో 20 కంపెనీలు వివిధ పరిమాణాలలో హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తున్నాయని తెలిపారు. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్లో గుజరాత్‌లోని కాండ్లా, తమిళనాడులోని టుటికోరిన్, ఒడిశాలోని పరదీప్ పోర్టు, ఆంధ్రప్రదేశ్‌లో పుడిమడక, జోధ్పూర్, ఒడిశా, పూణే, కేరళ వ్యాలీలు హైడ్రోజన్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసిందని తెలిపారు. దేశాన్ని ప్రపంచ కేంద్రంగా నిలిపేందుకు 2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజెన్ ఉత్పత్తి లక్షంగా ప్రభుత్వం పెట్టుకుందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

నేడు ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మీకోసం సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి రాజాబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.



వార్షికోత్సవం సందర్భంగా సంబరాల్లో సిబ్బంది

సుందరం ఫైనాన్స్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సుందరం ఫైనాన్స్ 25 ఏళ్ల వార్షికోత్సవాన్ని ఒంగోలులోని బ్రాంచిలో ఘనంగా జరుపుకున్నారు. సుందరం ఫైనాన్స్‌లో నిలబెట్టేది కేవలం దీర్ఘకాలం కాదు, నిజాయితీ, న్యాయం, సేవ, నిబద్ధతో సేవలు అందించడంతోనే ఈ బ్రాంచ్ నిలబడిందని ఫైనాన్స్ ఆంధ్రా ప్రాంత ఉపాధ్యక్షులు, హెడ్ ఎస్ బాలసుబ్రహ్మణియన్ తెలిపారు. 1997లో స్థాపించబడిన ఒంగోలు బ్రాంచ్ ఒంగోలులో ఆర్థిక ప్రాప్తిని విస్తరించడంలో కీలకపాత్ర పోషించిందని ఒంగోలు బ్రాంచ్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్ విఎస్ఆర్‌కె తెలిపారు. భవిష్యత్తులో కూడా సుందరం ఫైనాన్స్ ప్రజలకు ఇంకా చేరువ చేసేందుకు అనునిత్యం కృషి చేస్తామని తెలియజేశారు.

మట్టి అక్రమ తవ్వకం తప్పు..

పొంచిఉన్న ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

చూడరని మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రాత్రి వేళ తవ్వకాలు కొనసాగుతుంటాయి. జెసిబి, ప్రొక్లెయిన్ ఆపరేటర్లు పెద్దగా చదువుకోనందున ఎక్కడ గొయ్యి తీస్తే ఏమి నష్టం జరుగుతుందో కూడా అర్థం చేసుకోలేరు. మట్టిని తోడాలని తొందరపాటులో విలువైన విద్యుత్ టవర్ల అంచుల్లోనూ గోతులు తీశారు. చింతగుంట్ల-ఎల్‌బిఎస్ నగర్ సమీపాన గల నేషనల్ పవర్ గ్రిడ్ సింగిల్ లైన్ టవర్ల వద్ద అనుకున్నంత పని చేశారు. సింగిల్ లైన్ టవర్‌ల వద్ద కింద భాగంలో మట్టిని తోడటంతో టవర్ భూమిపై బలహీనంగా ఉంటుంది. పెనుగాలులు వీచిన సమయంలో ఒరిగిపడిపోయే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదే జరిగితే దాదాపు దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దాన్ని పునరుద్ధరించడానికి పది రోజుల సమయం పట్టే అవకాశం లేకపోలేదు. ఒక్క గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచినా రూ.కోట్లలో నష్టం వాటిల్లుతుంది. ఇంతటి ప్రమాదాన్ని సంబంధిత శాఖ అధికారులు గుర్తించకపోవడం, పవర్ గ్రిడ్ లైన్‌లపై పర్యవేక్షణ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. 'తప్పు ఎవరిదైనా... ముప్పు అపారమని, తక్షణమే సంబంధిత 'సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ యూనిట్ ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల



కలెక్టర్ వినోద్ కుమార్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్‌లో, మండల తహాశీల్దారు కార్యాలయాల్లోనూ తహాశీల్దార్లు, ఎంపీడీవోలు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికయినా 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు. పిజిఆర్‌ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

లింగంగుంటలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి-మద్దిపాడు



రోడ్డు పక్కనే వేసిన చెత్త

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని నిరంతరం అధికారులు చెబుతూనే ఉంటారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినప్పటికీ మండల పరిధిలోని లింగం గుంట గ్రామంలో రోడ్లపై చెత్త దర్శనమిస్తోంది. గ్రామం నుంచి ఏడుగుండ్లపాడు వైపు వెళ్లే రోడ్డులో శ్మశాన వాటిక వద్ద రోడ్డు పక్కనే చెత్త పడేశారు. ఆ చెత్త కుప్పలో కుక్కలు తిరుగుతూ వాటిని రోడ్డుపై లాక్కొస్తు చిందరవందరగా చేస్తున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రాంతంలో రాకపోకలు చేయాలంటే ముక్కులు మూసుకోవాల్సి వస్తుంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త సమస్యను ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. సచివాలయ సిబ్బంది విధుల పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు పది గంటల సమయం దాటితే గానీ ఉద్యోగులు ఎవరూ కూడా విధులకు హాజరు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

సెమీక్రిస్మస్ వేడుకల్లో 'దామచర్ల'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగర పరిధిలోని వెంగముక్కలపాలెంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు.

- కొత్తపట్నం మండలం, అల్లూరులో జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లోనూ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-కంభం

కంభం రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వ్యక్తి యొక్క తల మొండెం వేరుగా పడి ఉన్నాయి. మృతుని స్వగ్రామం బిరుదుల నర్వగా సమాచారం. రైల్వే పోలీసులు సమాచారం అందుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన యువకుడు

మండల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చీమకుర్తి మండలంలో నిధులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. అభివద్ధి పనులు వెంటనే పూర్తిచేసే విధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ నిధులు రూ.12.5 కోట్లతో మండలంలో రహదారులు, గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనుల నిర్మాణానికి ఆమోదించినట్లు తెలిపారు. డిఎంఎఫ్ నిధులతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు సైకిళ్ళు అందజేసే విధంగా ప్రతిపాదన తయారు చేసి జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పనకు, తాగునీటి వసతికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. డిఎంఎఫ్ నిధులతో రూ రెండు కోట్లతో స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు ఎఎంసి ఛైర్‌పర్సన్ మన్నం రాజేశ్వరి ప్రసాదు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు గొట్టిపాటి రాఘవరావు, ఇస్తర్ల ఏడుకొండలు, గొల్లపూడి సుబ్బారావు, జనసేన నాయకులు తాతినేని శ్రీరామ్, తహశీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిఎన్. విజయ్‌కుమార్


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అంజమ్మకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-మద్దిపాడు

మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో మండవ అంజమ్మ దశదిన కర్మ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్ పాల్గొని అంజమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా నందిపాడు గ్రామంలో నిర్వహించిన మన్నే శేషయ్య దశదిన కర్మలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి రాష్ట్ర నాయకులు అడకా స్వాములు, టిడిపి మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, కొత్తపల్లి సొసైటీ ఛైర్మన్ మండవ హరిప్రసాద్, మాజీ ఛైర్మన్ గట్టినేని అయ్యన్న, ముప్పా రవి, నల్లూరి శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహారావు, కాపూరి విజయరాజు, దాట్ల రాజు, పవన్, గడ్డం రవి, మొనపాటి రామకృష్ణ, దాసరి రమేష్, ప్రభాకర్ రెడ్డి, మండవ వెంకటస్వామి, రాయపాటి శ్రీనివాసరావు, గొల్లపూడి సుబ్బారావు, బుర్రియ్య పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- కనిగిరి

కనిగిరి మండలం నందన మారెళ్ళ కొండపై వెలసిన శ్రీ బాలకోటేశ్వరి సహిత కోటేశ్వర స్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డాడరు. స్థానికుల సమాచారం మేరకు శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఆలయ ప్రధాన ద్వారానికి ఉన్న తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అంతరాలయంలోని స్వామివారి, అమ్మవారి ఆలయాల తలుపులకు ఉన్న అద్దాలు, తాళాలను ధ్వంసం చేశారు. అమ్మవారికి సంబంధించిన బంగారు తాళిబొట్టును తీసుకెళ్లారు.సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి క్లూస్ టీం నిపుణులను పిలిపించి ఘటన స్థలంలో వేలిముద్రలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి. శ్రీరామ్ తెలిపారు.

నేడు 'చలో ఒంగోలు'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తున్న చలో ఒంగోలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీమంత్రి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కోరారు. శింగరాయకొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఛలో ఒంగోలు కార్యక్రమానికి సంబ ంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

అత్త గొంతు కోసిన అల్లుడు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని గడ్డమీదపల్లి గ్రామంలో అత్తపై అల్లుడు దాడి చేసి గొంతు కోశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్న నారాయణ తన కూతురు అంజలిని వీర నాగరాజుకి ఇచ్చి మూడు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. అంజలి ఎవరితో సెల్ చాటింగ్ చేస్తుందని భర్త వీర నాగరాజు, బంధువులు మందలించారు. దీంతో ఏడు నెలల క్రితం ఆమె ఆత్మహత్య చేసుకొని చనిపోయింది. అప్పటి నుంచి చిన్న నారాయణ ప్రతిరోజూ తాగిన మైకంలో అంజలి అత్త ఇంటికి వచ్చి తిడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి చిన్న నారాయణ తాగిన మైకంలో రమణమ్మ ఇంటికి వెళ్లి కత్తితో ఆమె గొంతుకోశాడు.ఆగ్రహించిన రమణమ్మ బంధువులు చిన్న నారాయణపై దాడి చేశారు. ఇద్దరు ఎర్రగొండపాలెం లోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

దారా అంజయ్యకు సేవా రత్న అవార్డు

ప్రజాశక్తి-దర్శి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్యను డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విశిష్ట సేవా రత్న అవార్డు వరించింది. గుంటూరు రూరల్ మండలం గోర్లవారిపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మాలల ఆత్మీయ కలయికలో అంజయ్యకు నిర్వాహకులు ఈ అవార్డును ప్రదానం చేశారు. తాళ్లూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన దారా అంజయ్య రెండు దశాబ్దాలుగా సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నారు. డైమండ్ సెక్యూరిటీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వందలాదిమంది నిరుద్యోగ యువతకు తమ సంస్థ ద్వారా ఉపాధి కల్పించారు. మాల మహానాడు అధ్యక్షులుగా సమాజంలో దోపిడీకి, వివక్షకు, అన్యాయాలకు అవమానాలకు గురవుతున్న అణగారిన వర్గాలకు అండగా నిలబడ్డారు. అవార్డు అందుకున్న సందర్భంగా మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత, మాజీ ఎంపీ హర్షకుమార్, ఎస్సి కమిషన్ మాజీ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.జె.విద్యాసాగర్ తదితరులు దారా అంజయ్యను అభినందించారు.


అవార్డు అందుకుంటున్న అంజయ్య


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

నరసారెడ్డికి మాజీ మంత్రి సురేష్ నివాళి

ప్రజాశక్తి- కొండపి

కొండపి మండలం కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన వాకా రమేష్ రెడ్డి తండ్రి నరసారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం దశదిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైసిపి పిఎసి సభ్యులు, కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం కె.ఉప్పలపాడు గ్రామానికి వెళ్లి నరసారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి, మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, వైసిపి గ్రామ అధ్యక్షుడు వాకా శ్రీకాంత్ రెడ్డి, వాకా రమేష్ రెడ్డి, నరసారెడ్డి, నజీర్, వైసిపి నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

ఎద్దుల దాడిలో యజమాని మృతి

ప్రజాశక్తి-అర్ధవీడు

ఎద్దుల దాడిలో యజమాని మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గన్నేపల్లి గ్రామంలోఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి షేక్ మహ్మద్ (60) అనే వ్యక్తి వ్యక్తి తన ఎద్దులను మేత కోసం పొలం తోలుకెళ్లాడు. మేత మేస్తున్న రెండు ఎద్దులు ఘర్షణ పడ్డాయి. దీంతో మహ్మద్ వాటిని విడదీసే ప్రయత్నం చేశాడు. మితిమీరిన పోట్లాటతో యజమాని పై దాడి చేశాయి. దీంతో మహ్మద్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికి అక్కడే మృతిచెందాడు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

ప్రజాశక్తి-దొనకొండ

రైలు ప్రయాణికులకు భద్రత కల్పించేందుకు రైల్వే శాఖ అనేక ప్రణాళికలతో ముందుకు సాగుతుందని గుంటూరు రైల్వే డివిజనల్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేష్‌కుమార్ తెలిపారు. దొనకొండ రైల్వేస్టేషన్‌లోని రైల్వే రక్షకదళం కార్యాలయాన్ని ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రైలు ప్రయాణికుల సేఫ్టీ నిమిత్తం రైళ్లల్లో ఎస్కార్ట్‌గా వెళ్లే ఆర్పీఎఫ్ సిబ్బందికి బాడీ వార్న్ కెమేరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా రైళ్లల్లో ఎలాంటి వ్యక్తులు ప్రయాణిస్తున్నారు, దొంగల కదలికలను గుర్తించ వచ్చునని తెలిపారు. రైళ్లల్లో దొంగతనాలను నిరోధించటం, దొంగలను పట్టుకోవటంలో గుంటూరు రైల్వే డివిజన్ ముందుందన్నారు. అనంతరం పలు రికార్డులు, కార్యాలయ పరిసరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వీరాంజనేయులు, ఆర్పిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సుధాకర్

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

వాహన చోదకులు నిబంధనలు పాటించాలని కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. స్థానిక పెట్రోల్ బంక్ వద్ద వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వారికి అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. వాహన చోదకులు త్రిపుల్ రైడింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారి నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలన్నారు. వాహనాలు నడిపే సమయంలోదానికి సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో నలుగురు కార్మికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శింగరాయకొండ - శానం పూడి రహదారిలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నాగేశ్వర్, రాహుల్, మట్వా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వీరు 11 కెవి విద్యుత్ లైన్ పనుల నిమిత్తం కూలికి వచ్చినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ మహేంద్ర సందర్శించారు. క్షతగ్రాతులను 108 వాహనంలో ఒంగోలు హాస్పిటల్‌కు తరలించారు.

టిడిపి మండల మాజీ అధ్యక్షుడు కాశయ్య మృతి

ప్రజాశక్తి- దొనకొండ

టిడిపి మండల మాజీ అధ్యక్షుడు దుగ్గెంపూడి కాశయ్య(77) శనివారం రాత్రి రుద్రసముద్రం గ్రామంలోని తన స్వగృహంలో మృతిచెందాడు. కాశయ్య మూడు దఫాలు టిడిపి మండల అధ్యక్షుడిగా, మూడు దఫాలు రుద్రసముద్రం గ్రామ సర్పంచిగా విశేష సేవలందించారు. కాశయ్య మృతి గురించి తెలుసుకున్న టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు కాశయ్య మృతదేహానిన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యుటిఎఫ్ నేత సుబ్రమణ్యంకు ఘన నివాళి

ప్రజాశక్తి - నగరం

ఎర్రజెండా ఉద్యమాల్లో కష్టజీవులు కోసం పనిచేసినా ఎవిపికె సుబ్రహ్మణ్యం స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు పాల్గొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు, సీపీఎం సభ్యులు ఎవిపికె సుబ్రహ్మణ్యం సంతాప సభ సిపిఎం నగరం మండల కార్యదర్శి కొప్పుల గోపి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూల మాల వేసి, మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై ఆరోగ్యం సహకరించినంతకాలం అంకితభావంతో పనిచేశారని అన్నారు. చాలా మంది పుడతారు చనిపోతారు కానీ ప్రజల కోసం తన జీవితంలో ఎర్రజెండా బాటన కొద్ది మంది మాత్రమే త్యాగాలు చేస్తూ నిలబడుతున్నారని అన్నారు. ఉన్నత ఆశయాలు కోసం పనిచేస్తున్నారని అన్నారు. సమాజ శ్రేయసుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, సిపిఎం ఉద్యమంలో భాగస్వామ్యమైన సుబ్రహ్మణ్యంకు ఘనమైన నివాళులని, ఆయన ఆశించిన సమ సమాజాన్ని స్థాపించడం కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ మణిలాల్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె సాయి ప్రసాద్, చెరుకుపల్లి ఎంఇఓ టి నవీన్ కుమార్, సిఐటియు మండలం అధ్యక్షులు ఎం చంద్రరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ, నాయకులు ఎన్ కృష్ణకుమారి, ప్రజా సంఘాల నాయకులు పి మనోజ్, కెవి లక్ష్మణరావు, జి నాగరాజు, పి నాగమల్లేశ్వరరావు, డి అగస్టీన్, కె రమేష్, కుటుంబ సభ్యులు, నగరం ముఠా, రిక్షా, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

లబ్ధిదారులకు న్యాయం చేస్తా : ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

ఆటోనగర్ భూములు నిజమైన లబ్ధిదారులకే చెందాలని, వారికి అండగా న్యాయం చేస్తానని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. చీరాల తాలూకా ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఆయనను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ 1995 నుంచి ఎపిఐఐసికి డీడీలు కట్టి, స్థలాలు తమ సొంత ఖర్చులతో సంరక్షించుకుంటూ వచ్చిన వాస్తవ లబ్ధిదారులైన ఆటోమొబైల్ కార్మికులకు ఈ స్థలాలు కేటాయించకుండా బయటి వ్యక్తులకు ఇవ్వడం అన్యాయమని తెలిపారు. గతంలో శాసన సభ్యులు ఈ స్థలాల అభివృద్ధికి రోడ్లు, విద్యుదీకరణ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో సహకరించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కొందరు బ్రోకర్లు రంగప్రవేశం చేసి ఒక్కొక్కరికి మూడు, నాలుగు ప్లాట్లు చొప్పున అక్రమ అగ్రిమెంట్లు చేస్తున్నారని వివరించారు. ఇది పూర్తిగా అన్యాయమని యూనియన్ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన రేట్లు చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ స్థలాలు వాస్తవ లబ్ధిదారులైన చీరాల ఆటోమొబైల్ కార్మికులకే కేటాయించాలని కోరారు. ఇప్పటివరకు జరిగిన అక్రమ అగ్రిమెంట్లను రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను త్వరగా పరిష్కరించేందుకు అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. స్థానికులకు కాకుండా ఇతరులకు స్థలాలు ఇవ్వడం సరికాదని అన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యకు న్యాయమైన పరిష్కారం తీసుకువస్తానని అన్నారు. మొదటి నుంచి డీడీలు కట్టిన వాస్తవ లబ్ధిదారులకు తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి కొండయ్య, సంఘ నాయకులు శంకర్రావు, దావూద్ భాషా, సలీం, ఇంతియాజ్, సమద్, బుడే సాహెబ్ హుస్సేన్, సాంబయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న ఆటోనగర్ లబ్ధిదారులు

కరాటే పోటీల్లో కెజిబివి విద్యార్థుల విజయం



విజేతలుగా నిలిచిన బల్లికురవ కెజిబివి విద్యార్థులు

ప్రజాశక్తి - బల్లికురవ

పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ జాతీయ స్థాయి కుంపు, కరాటే ఛాంపియన్షిప్ 2025 పోటీల్లో స్థానిక కెజిబివి విద్యార్థులు విశేష ప్రతిభ చూపి విజయకేతనం ఎగురవేశారు. కోచ్ ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో అండర్14 స్వర్ణ పథకాలు 11, కాంస్య పథకాలు 10, అండర్ 17లో స్వర్ణ పథకాల 6, కాంస్య పథకం 1 సొంతం చేసుకున్నారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినులకు కోచ్ పి ఇశ్రాయేలు, పిఈటి స్వర్ణలతకు సహకరించిన ఎఎన్ఎం విజయశాంతిని ప్రిన్సిపాల్ సరళ కుమారి, సిబ్బంది అభినందించారు.

కొల్లూరు : అమరావతి నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ పోటీలు గుంటూరులోని బ్రహ్మానందం స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. పోటీల్లో కొల్లూరులోని ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ స్కూలు నుండి 13 మంది విద్యార్థులు పాల్గొనగా 6 విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించగా మరో ఆరుగురికి సిల్వర్ మెడల్, మరొక విద్యార్థికి కాంస్య పథకం సాధించారు. పాల్గొన్న 13 మంది పథకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ టి నవీన్ పాల్, ప్రిన్సిపాల్ అనిత కుమారి, రాజన్ కరాటే మాస్టర్ పులివర్తి సోమయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.



గోల్డు మెడల్ సాధించిన కొల్లూరు విద్యార్థులు

కోటి సంతకాల పత్రాలు తరలింపు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా సోమవారం బాపట్ల పట్టణంలోని వైసిపి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కోటి సంతకాల ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి ఇన్చార్జి వరకుటి అశోక్ బాబు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై ర్యాలి జయప్రదం చేయాలని కోరారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న అశోక్ బాబు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేరికోస్ వెయిన్స్ వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి - బాపట్ల

వేరికోస్ వీన్స్ వ్యాధికి ఎవరు భయపడవద్దని ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ డాక్టర్ స్వాతి అన్నారు. పట్టణంలోని రోటరీ కళ్యాణ మండపంలో సుశ్రుత ఫౌండేషన్, హైదరాబాద్ ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వేరికోస్ వీన్స్ సమస్యతో బాధపడే వారికి ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు.. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య శిబిరానికి 170 మంది వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ వ్యాధికి గురైతే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రావాలని అన్నారు. హైదరాబాదు ఆసుపత్రికి వచ్చే వారికి ఉచితంగా బాపట్ల నుండి బస్సు ఏర్పాటు చేస్తారని తెలిపారు. బుధవారం బస్సు బాపట్ల నుండి బయలు దేరుతుందని అన్నారు. రూ.5వేల విలువచేసే రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారని అన్నారు. డాక్టర్ స్వాతి మాట్లాడుతూ వేరికోస్ వ్యాధి అనేది సహజంగా చెడు రక్తం నరాల్లో ఉండేవారికి, ఎక్కువగా నిలబడే వారికి, ఎక్కువగా కూర్చునే వారికి వస్తుందని, దీనికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ వ్యాధికి అధునాతన వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య శిబిరం చైర్మన్ టి మల్లికార్జునరావు, రోటరీ కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, రోటరీ సభ్యులు ఎస్ రమేష్ బాబు, ఇ హరిబాబు, రామ సుబ్బారావు, జెవి కృష్ణారావు, తోట కృష్ణమూర్తి, సుధీర్ కుమార్, టి సుబ్బారావు పాల్గొన్నారు.



చీరలు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

చీరలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని 18వ వార్డు కట్టక్రిందపాలెంలో సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ నందు గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎపి లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు హాజరై మాట్లాడారు. క్రీస్తు శాంతి సందేశం ప్రపంచానికే మార్గదర్శమని, అనుసరణీయమని అన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో అద్దంకి ఎఎంసి చైర్మన్ వరగాని పద్మావతి, మున్సిపల్ చైర్ పర్సన్ ఎల్ ఎస్తేరమ్మ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఎపి సిఆర్‌డిఎ ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి - అమృతలూరు



ఎంపిడిఒ ఎం శేషమాంబ

నేడు ఎపి సిఆర్‌డిఎ ఆధ్వర్యంలో అనధికారిక లే అవుట్లపై బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ 2025, ప్లాట్ల క్రమ బద్ధీకరణ పిఎల్ఆర్ 2020పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి మారుతి శేషమాంబ తెలిపారు. ఈ పథకాలపై ఈ నెల 15 సోమవారం మండలంలోని కూచిపూడి, అమృతలూరు, గోవాడ గ్రామాల్లో సదస్తులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముందుగా గోవాడ, అమృతలూరు, కూచిపూడి గ్రామంలో సాయంత్రం 3 గంటల నుండి 4 గంటలకు సదస్సులు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో సిఆర్డిఎ ప్రతినిధులు పాల్గొని అనధికార భావన నిర్మాణ యజమానులు, అనుమతికి మించి నిర్మించిన భవన యజమానులకు నిర్మాణాలపై అనుమతులు గురించి, అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న లేఔట్ యజమానులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు సిఆర్‌డిఎ అధికారులు కల్పించే అవగాహన పొందాలని కోరారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

బహుమతులు అందజేత

ప్రజాశక్తి - మేదరమెట్ల

అద్దంకి, కొరిశపాడు, పంగులూరు, ఇంకొల్లు, బల్లికురవ మండలాల స్థాయిలో 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు యలగాల సుబ్బారావు స్మారక ప్రతిభ పోత్సాహక బహుమతులు కోరిసపాడు మండలంలోని రావినూతల జిల్లా పరిషత్ పాఠశాల్లో ఆదివారం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన చందలూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి బాచిన మోహన్ శ్రీనివాస్, కట్ట వంశీకృష్ణ, కూకట్లపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన కె లోహిత్ గెలుపొందారు. చక్రాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యర్థి ఈశ్వర రెడ్డి ద్వితీయ బహుమతి రూ.10వేలు పొందినట్లు హెచ్ఎం మారం ఈశ్వరరెడ్డి, చందలూరుకు చెందిన యు వెంకట గీత చరణ్, ఇంకొల్లు పాఠశాల చెందిన గెలుచుకోగా, మూడో బహుమతి రూ.5వేలు కొప్పెరపాడు జిల్లా పరిషత్ పాఠశాల చెందిన ఎన్ కీర్తన, కొప్పిరుపాడు జడ్పీహెచ్చీ పాఠశాల చెందిన ఎలగాల మోహన్ మణికంఠ, పంగులూరుకు చెందిన జడ్పీహెచ్ పాఠశాలకు చెందిన ఎన్ అల్పిత విద్యార్థులు గెలుచుకున్నారు. నిర్వాహకులు మొదటి బహుమతిగా ముగ్గురిని, రెండో బహుమతిగా ముగ్గురిని, 3వ బహుమతికి ముగ్గురిని ఎంపిక చేశారు. యలాగాల సుబ్బారావు కుటుంబీకులు నిర్వహించారు. కార్యక్రమంలో డిఇఒ గంగాధర్ పాల్గొన్నారు.

కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై

పోరాటాలే 'మహాసభల' లక్ష్యం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్స్ సహా కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేయడమే సిఐటియు అఖిలభారత మహాసభల ప్రధాన లక్ష్యమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా ఆదివారం నాడు ఒంగోలు నగరం 49వ డివిజన్ (సత్యనారాయణపురం) విజేత హాస్పిటల్ సెంటర్‌లో సిఐటియు జెండాను ఆయన ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు వి.మాలకొండయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎం.రమేష్ మాట్లాడుతూ డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత మహాసభలు జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభల్లో లేబర్ కోడ్స్ వ్యతిరేక ఉద్యమం, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై విస్తృత చర్చ జరిపి, వాటికి ప్రత్యామ్నాయ విధానాలను ప్రభుత్వాలు అమలుపరచేలా పోరాటాల రూపకల్పన జరుగుతుందన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జరిగే ఈ పోరాటాల్లో కార్మికులు, ప్రజలందరూ భాగస్వాములై మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు కార్మికులందరూ పెద్ద ఎత్తున హాజరై తమ ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రమేష్, సిఐటియు నాయకులు యన్.వీరాస్వామి, ధారా వెంకటేశ్వర్లు, భీష్మాచారి, ఎం.శ్రీను, ఆర్.పెంచలకొండయ్య, రామయ్య, ఎం.నారాయణ, డి.కోటయ్య, ఎస్‌కే.సుభాని, వి.కాశిం, టి.వీరయ్య పాల్గొన్నారు. అలాగే ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, ఐద్వా నాయకులు కె.రాజేశ్వరి, ఐలు నాయకులు డి.ఏడుకొండలు, టి.భక్త్‌సింగ్ రాజు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.



సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

ఇంటింటి ప్రచారం

సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ త్రోవగుంట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తంబి శ్రీనివాసులు, కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.సుబ్బారావు, కె.నాగేశ్వరరావు, బి.రాం ప్రసాద్, బి.భవనారాయణ, రాగే రాములు, కె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై

పోలీసుల ప్రత్యేక డ్రైవ్

అనర్థాల పట్ల ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది మరియు రోడ్ సేఫ్టీ వారియర్స్ కలసి హెల్మెట్ మరియు రోడ్డు భద్రతా నియమాలపై డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని, కావున ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి రక్షణ కవచంలా హెల్మెట్ ఉంటుందన్నారు. కావున ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.



వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరిస్తున్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత మరియు మీ కుటుంబం యొక్క ఆనందం గురించి ఆలోచించాలని అధికారులు తెలియజేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక


ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఈ నెల 15న సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని పిజిఆర్‌ఎస్ హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.

మంత్రిని కలిసిన గ్రంథాలయ చైర్మన్

ప్రజాశక్తి-టంగుటూరు


జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన ముప్పవరపు సుచరిత్ర రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయం స్వామిని ఆదివారం నాడు మర్యాద పూర్వకంగా కలిశారు. టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి.. పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ముప్పవరపు వీరయ్యచౌదరి లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రంథాలయ చైర్మన్ సుచరిత్ర

మంత్రి స్వామికి సన్మానం

శింగరాయకొండ: రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజ నేయ స్వామిని ఆదివారం రాత్రి శింగరాయకొండ ఉపసర్పంచిగా ఎంపికైన ఓలేటి రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మించల బ్రహ్మయ్య, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, సుదర్శ ప్రసాదరావు, చీమకుర్తి కృష్ణ, షేక్.ఎస్దాని, ఇమ్మడిశెట్టి రామారావు, పాదం బ్రహ్మయ్య, పోనూరి నరేష్, కళ్లగుంట నరసింహ, పాదర్తి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి స్వామిని సన్మానిస్తున్న దృశ్యం

'టిడిపి' బాపట్ల పార్లమెంట్‌లో

అధ్యక్షుడి ఎంపిక కోసం కసరత్తు

పోటీలో రాజశేఖర్, రవికుమార్, శ్రీనివాసరావు..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కమిటీల నియామకంలో జరుగుతున్న జాప్యంపై పార్టీ అధినేత చంద్రబాబు ఇటీవల అసంతప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 15 నాటికల్లా కమిటీల నియామకం పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యుల ఎంపిక కోసం ముగ్గురు నేతలతో కమిటీలు వేయడం జరిగింది. ఈ మేరకు బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ నియామకం కోసం శాసనమండలి చీఫ్ విప్ అనురాధతో పాటు పార్టీ నేతలు వీరంకి గురుమూర్తి, మన్నె సుబ్బారెడ్డి కమిటీ సభ్యులుగా ఉన్నారు. గత ఆగస్టు 25న బాపట్ల వచ్చిన త్రిసభ్య కమిటీ పార్టీ కార్యాలయంలో విస్తృత సమావేశం ఏర్పాటు చేసి బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చిన పార్టీ నేతలతో సమావేశం అనంతరం విడివిడిగా ఆశావహుల నుంచి అభ్యర్థనలను తీసుకున్నారు. వీరితో పాటు జిల్లా మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ, మద్దులూరి మాలకొండయ్య, బిఎన్ విజయ్ కుమార్ లు కూడా త్రిసభ్యకమిటీతో సమావేశమై అధ్యక్షుడి ఎంపికలో తమ అభిప్రాయాలను తెలిపారు. పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు తన అభిప్రాయాన్ని చెప్పారు. ఆనాటి సమావేశంలో పార్టిలో సీనియర్లుగా ఉన్న 20 మంది వరకు బాపట్ల పార్లమెంట్ టీడీపి అధ్యక్ష పదవి కోరినట్లు తెలిసింది. ప్రస్తుత పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖరబాబు మరోమారు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్యలతో పాటు చీరాలకు చెందిన విద్యాసంస్థ అధినేత పొగడదండ రవికుమార్, రేపల్లెకు చెందిన గూడపాటి శ్రీనివాసరావుతో పాటు పలువురు బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధ్యక్ష పదవిని కోరినట్లు తెలిసింది. చీరాలకు చెందిన మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు పేరు కూడా ప్రచారంలో కొచ్చింది. గత ఆగస్టు నెలలో జరిగిన సమావేశంలో అధ్యక్ష పదవి కోసం వచ్చిన విజ్ఞప్తులన్నింటినీ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతామని, తుది నిర్ణయం అక్కడే జరుగుతుందని త్రిసభ్యకమిటీ సభ్యులు చెప్పారు. అయితే ఆ తరువాత కమిటీ ఎంపికలో ప్రతిష్టంభన నెలకొంది. బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఆధ్యక్ష ఎంపిక అంశం పలు సామాజిక సమీకరణాలతో పాటు ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే ఇచ్చిన పదవుల దామాషాను కూడా పరిశీలనలోకి తీసుకోవడం జరుగుతుందని చెబుతున్నారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలో వేమూరు, సంతనూతలపాడు నుంచి ఎస్‌సి ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, బిఎన్ విజయ కుమార్ ఉన్నారు. ఎస్‌సి సామాజిక వర్గం నించి ప్రస్తుతం పార్టీ అధ్యక్షునిగా ఉన్న సలగల రాజశేఖర్‌బాబుకు బాపుడా చైర్మన్ పదవి ఇచ్చారు. కమ్మ, గౌడ సామాజిక వర్గాల నుంచి గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్‌లు మంత్రులు ఉన్నారు. రాజు,యాదవ సామాజిక వర్గాల నుంచి వేగేశన నరేంద్రవర్మ, మద్దులూరి మాలకొండయ్య ఎమ్మెలుగా ఉన్నారు. ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, బిఎన్ విజయకుమార్‌లను అధ్యక్ష బాధ్యతలు చేపట్టమని పార్టీ నేతల నుంచి ప్రతిపాదన రాగా వారు తిరస్కరించినట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో బాపట్ల పార్లమెంట్ పరిధిలో మంచి పదవి లేని వారు కాపు వర్గానికి చెందినవారుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఆధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆశావహుల్లో కాపు వర్గం నుంచి చీరాలకు చెందిన పొగడదండ రవికుమార్, రేపల్లె నుంచి గూడపాటి శ్రీనివాసరావులు ఉన్నారు. వీరి పేర్లను త్రిసభ్యకమిటీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత అధ్యక్షులు రాజశేఖర బాబును మరో అవకాశం ఇవ్వడం లేదా కాపు వర్గానికి చెందిన వారికి బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఆధ్యక్ష పదవి ఇవ్వడం చేస్తారని తెలుస్తోంది. అయితే పలు వడపోతల అనంతరం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల సూచనల మేరకు బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శుల పేర్లు ఖరారు చేస్తూ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఆయా నియోజక వర్గాల్లో ఇప్పటికీ ఇచ్చిన నామినేటెడ్ పదవుల ప్రాతిపదికన కమిటీ సభ్యుల ఎంపికలను పూర్తి చేసి మరో వారంలో పూర్తి స్థాయి బాపట్ల పార్లమెంట్ కమిటీని ప్రకటిస్తారని తెలుస్తోంది.

నడక పోటీల్లో 'బండి'కి ప్రథమస్థానం

ప్రజాశక్తి - బాపట్ల



నడక పోటీల్లో విజేతలైన క్రీడాకారులు


మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 50 నుండి 55 ఏళ్ల విభాగంలో నడక పోటీల్లో బాపట్లకు చెందిన బండి శ్రీనివాసరావు ప్రథమ స్థానంలో నిలిచారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఎపి స్టేట్ 7వ మాస్టర్స్ అదేటిక్స్ ఆధ్వర్యంలో నడక పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీల్లో గుంటూరుకు చెందిన వి కాంతారావు ద్వితీయ స్థానం, బాపట్లకు చెందిన టి రంగారావు తృతీయ స్థానంలో నిలిచినట్లు అథెటిక్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి నజీర్ తెలిపారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంశా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లాల్ వజీర్, క్రీడాకారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న చప్పిడి వీరయ్య

వీరయ్యకు రోటరీ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - అద్దంకి

హైదరాబాద్‌లో రోటరీ జిల్లా 3150 పాస్ట్ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి నివాసంలో జరిగిన రోటరీ ఆత్మీయ సమావేశంలో గత సంవత్సరంలో ఎక్కువ సేవా కార్యక్రమాలు చేసినందుకు రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు చప్పిడి వీరయ్యకు క్లబ్ ఎక్సలెన్స్ అవార్డు అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ ఎజి షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు. క్లబ్ ఎక్సెలెన్స్ అవార్డు అందరి సహకారంతో సాధించామని, అందులో మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావుల పాత్ర ప్రశంస నీయ మైనదని పేర్కొన్నారు. తమ టైంలో వేలామూరిపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన రోటరీ పార్క్ ప్రధానమైనదని అన్నారు. ఎక్సెలెన్స్ అవార్డు సాధించిన గత కార్యవర్గానికి ప్రస్తుత అధ్యక్షులు పూర్ణచంద్రరావు, కార్యదర్శి అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న దోవా రమేష్‌రాంజీ

దోవ రమేష్‌కు అంబేద్కర్ సేవా రత్న అవార్డు

ప్రజాశక్తి - రేపల్లె

గత 20ఏళ్లుగా పాత రేపల్లె తాలూకా ప్రాంతంలో దళిత అంబేద్కర్ యువజన సమాఖ్య అధ్యక్షులుగా, మాల మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా అనేక సాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తూ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జైభీమ్ రావ్ భారత్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన న్యాయవాది దోవా రమేష్ రాంజీకి గుంటూరులో నిర్వహించిన మాలల ఆత్మీయ కలయికలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశిష్ట సేవా రత్న అవార్డుతో మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకటరావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్ కుమార్, మాజీ ఎస్సీ కమిషన్ చైర్మన్ కారుమూడి విక్టర్ ప్రసాద్ చేతుల మీదగా ప్రధానం చేశారు.

వర్షం కోసం రైతుల ఎదురుచూపు

నిరాశతో ఇంజన్లతో నీటి తడులు ఇస్తున్న రైతులు


భీమవరంలో ట్రాక్టర్ ఇంజన్‌తో నీళ్లు పెడుతున్న దృశ్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు

భూమిలో అడుగుభాగాన క్షేమ ఉన్నప్పటికీ ఖరీఫ్ పంటతోపాటు రబీ పంటగా సాగు చేసిన మిరప, మొక్కజొన్న, శనగపైరు బెట్టకు వచ్చింది. పరిస్థితి ఇలానే కొనసాగితే శనగ దిగుబడులు తగ్గుతాయని రైతులు తెలిపారు. నవంబర్ ప్రారంభంలో మొంథా తుఫాను ప్రభావంతో అధిక వర్షాలు కురిశాయి. అయితే నవంబర్ 2వ వారం నుంచి సహజంగా రైతులు రబీ పంట సాగులో సెనగ, మొక్కజొన్న సాగు చేస్తారు. గత రెండేళ్లుగా నవంబర్, డిసెంబర్లో సైతం వర్షాలు అధికంగా పడి శనగ పంట తడిసి రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ ఏడాది అందుకు భిన్నంగా వాతావరణం నవంబర్ 2వ వారం నుంచి తుఫాను, వాయుగుండాలు ఏర్పడినప్పటికీ ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని గ్రామాలు, బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, పర్చూరు ప్రాంతాల్లో వర్షాలు కురవలేదు. డిసెంబర్ 12 రోజులు మబ్బులు చేస్తూ వర్షాలు రోజు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో రైతులు ముందస్తుగా విత్తన ఎదలు సమయం వచ్చినప్పటికీ పెట్టకుండా వేచి చూచారు. అయితే ఈ ప్రాంతాల్లో వర్షం పడకుండానే వట్టి మబ్బులు, ఈదురుగాలుల వాతావరణంతోనే సరిపుచ్చింది. కొందరు రైతులు ధైర్యం చేసి సెనగ, మొక్కజొన్న విత్తనాలతో పాటు మిరప నాట్లు వేశారు. వర్షం పడితే దెబ్బతింటుందని నాటకుండా విత్తనాలు వేయకుండా ఉన్న రైతులకు నిరాశే మిగిలింది. ఈ ప్రాంతాల్లో విత్తనాలు నాటడం, వెదపెట్టడం ఆలస్యంగా చేశారు. కనీసం ఒక మోస్తరు వర్షమైన పడుతుందనుకున్న రైతులకు నిరాశ మిగిలింది. ఒక మోస్తరు వర్షం పడినా నేల తడిసి చిరు మట్టి గడ్డలు మెత్తబడి, మొలచిన శనగ, మొక్కజొన్న, అనుమతితో సాగుచేసిన పొగాకు, ఖరీఫ్ పంటలైన పత్తి, ముదురు మిరప, లేత మిరప పంటలకు అనువుగా ఉండేది. అయితే వర్షం అసలు పడకపోవటంతో నేలలో తేమ ఉన్నప్పటికీ ఇప్పటికే తల బెట్టకు వచ్చాయని రైతులు అంటున్నారు.

నీటి తడులు ప్రారంభం

ఖరీఫ్ పంటలైన పత్తి, ముదురు, లేత మీరప, శనగ పైర్లకు సైతం తల బెట్టకు వచ్చి ఎదుగుదల లోపించి పైర్లు నాణ్యత లేకుండా ఉన్నాయి. దీనికి తోడు వాతావరణం అనుకూలించటం లేదు. మంచు కురవటం లేదు. పైర గాలి కూడా వీయటం లేదు. ఈ ప్రభావంతో బెట్టకు వచ్చిన పైర్లకు నీటి తడులకు రైతులు సిద్ధమయ్యారు. కొంతమంది రైతులు చిన్న ఇంజన్‌తో మిరప మొక్కల మొదుళ్ల వద్ద పై నేల తడుపుతున్నారు. పూర్తిగా నీటి తడులు ఇస్తే మళ్లీ వర్షం కురిస్తే మిరప దెబ్బతింటుందన్న ఆలోచనతో ప్రస్తుతానికి ఆ విధానం ఆచరిస్తున్నారు. కొంత మంది రైతులు వర్షం ఊరించి ఉసురు మనిపించిందని, వర్షం కురవదు అన్న ధైర్యంతో ఏకంగా ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్ ఇంజన్లతో నీటి తడులు కడుతున్నారు. కొంత మంది రైతులు స్పింకర్ల ద్వారా నీటి తడులు ఇస్తున్నారు. శనగ ముందస్తుగా సాగు చేసిన రైతులు, బెట్టకు వచ్చే మెరక సెనగ సాగు పొలాలకు సైతం స్పింకర్ల ద్వారా, ప్లాస్టిక్ పైపుల ద్వారా తేలికగా నీటితడులు ఇస్తున్నారు. మరి కొంత సమయం వేచి చూచి వర్షం కురవకుండా వాతావరణం ఇలానే ఉంటే మిరప సాగు చేసిన రైతులు, మొక్కజొన్న రైతులు పూర్తిగా నీరు కట్టే పనులు ప్రారంభించనున్నారు. అయితే తేలకపాటి ఒక మోస్తరు వర్షం మరో వారం రోజుల్లో కురిసిన పంటలకు ప్రయోజనం ఉంటుందని అంటున్నారు. పైర్లు వేపుగా పెరిగి, తెగుళ్లు సోకకుండా సెనగ, మొక్కజొన్న దిగుబడులు బాగా వస్తాయని తెలిపారు. ఖరీఫ్లో సాగుచేసిన విత్తన పత్తి పంటలకు సైతం ఇప్పటికే తడులు ఇచ్చారు.


స్పింకర్లతో మిరపకు నీళ్లు పెడుతున్న దృశ్యం

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కారంచేడు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో స్థానిక యార్లగడ్డ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, నోవా అగ్రిటెక్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలు, పురుషులకు వేరువేరుగా కౌంటర్ల ద్వారా రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి పరీక్షలు చేశారు. 425 మంది హాజరుకాగా 105 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని వైద్యులు సూచించారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి టిడిపి నాయకులు, గ్రామ పెద్దలు ప్రజలు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎపి ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమలశెట్టి శ్రీహరి, నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ హుస్సేన్, ఎపి రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కృష్ణారావు మాట్లాడారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి గత 15 ఏళ్లుగా రాజకీయాలకతీతంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు ఆరోగ్యం అత్యంత ముఖ్యమైన అంశం అన్నారు. కంటి సమస్యలు జీవితాన్ని అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉందని అన్నారు. నియోజకవర్గంలో లక్ష మందికి కంటి చూపు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి నెల వివిధ మండలాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరాల్లో కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచిత కళ్లజోడులు, శస్త్రచికిత్స అవసరమైన రోగులకు మెరుగైన వైద్యం అందేలా ఏర్పాట్లు చేయడం ఎమ్మెల్యే ఏలూరి సేవ నిరతికి నిదర్శనం అన్నారు. పేద ప్రజలు ఖర్చుల భయంతో వైద్యం వాయిదా వేసుకోవద్దన్నదే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఏలూరి వైద్య శిభిరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. సామాజిక బాధ్యతగా రాజకీయాలకతీతంగా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతిన ఉదయ్ భాస్కర్, సర్పంచ్ బాలిగ శివ పార్వతి శ్రీనివాస్, ఉప సర్పంచ్ యార్లగడ్డ రత్తయ్య చౌదరి, కొత్తగొర్ల శ్రీరాములు, కంభంపాటి నరేంద్ర, పోతిన నాగేశ్వరరావు, మైలా బ్రహ్మయ్య, దగ్గుబాటి చౌదరి, రాయనీడి హనుమంతరావు, రామకృష్ణ, శాంతయ్య, యార్లగడ్డ శ్రీనివాసరావు, పోతిన రాజేంద్ర ప్రసాద్, కోసరాజు సురేంద్ర, ఖాసీం, బంగారు బాబు, పూర్ణయ్య, బ్రహ్మాజీ, చంద్రశేఖర్, రియాజ్ పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చిన్నారులు

అలరించిన సండే సందడి

ప్రజాశక్తి - బాపట్ల

పురపాలక సంఘ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న హ్యాపీ సండే కార్యక్రమాన్ని పట్టణంలోని వివేకనంద కాలనీ పార్కు ఆవరణలో ఆదివారం నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలతో సండే సందడి అలరించింది. జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్ సంధానకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో మునిసిపల్ డిఈ కృష్ణారెడ్డి, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


బ్రెడ్ పంపిణీ చేస్తున్న తేళ్ల రాంబాబు

పేదలకు బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

మాజీ ఎంఎల్‌ఎ కరణం బలరామకృష్ణ మూర్తి, వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో వైసిపి మేధావుల సంఘం అధ్యక్షుడు తేళ్ల రాంబాబు మండలం లోని తోటవారిపాలెం స్ట్రెయిట్ కట్ మీద ఉన్న మహిళలతో కలసి క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. క్రిస్మస్ అంటే ప్రేమ, సంతోషం, ఒకరినొకరు ప్రేమతో పలకరించు కోవడమని తెలిపారు.

ఉప్పుటూరు పేరుతో టోల్‌ప్లాజా

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని ఉప్పుటూరుకు లవణపురి అగ్రహారం అనే పేరు వందల సంవత్సరాల క్రితం ఉండేది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆ ఊరికి వెళ్లి సరుకులు తెచ్చుకున్నట్లు ఆనాటి తరానికి చెందిన పెద్దలు చెప్తూ ఉండేవారు. ఇప్పుడు ఓడరేవు, పిడుగురాళ్ల జాతీయ రహదారి 167ఎపై టోల్ ప్లాజా నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ రోడ్డుకు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ ఉప్పుటూరు టోల్ ప్లాజాగా పేరు పెట్టి బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఓడరేవు నుంచి చిలకలూరిపేట వరకు మొదటి టోల్ ప్లాజా కావటం తమ గ్రామం పేరుతో టోల్ ప్లాజా ఏర్పాటు చేస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో మరలా తమ గ్రామానికి పూర్వవైభవం రావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉప్పుటూరు పేరుతో టోల్ ప్లాజా

21న పల్స్‌పోలియో

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ నెల 21న జరిగే జాతీయ పోలియో చుక్కల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మోహసినా తాజ్ తెలిపారు. 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. పోలియో చుక్కల కేంద్రాలు, సిబ్బందిని సిద్ధం చేసినట్లు చెప్పారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలులోని తమ్మన మల్లికార్జున రావు ఉన్నత పాఠశాల్లో 1974 - 1979 విద్యా సంవ త్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పండుగను తలపించే విధంగా నిర్వహించారు. వందేమాతరం గీతాలాపనతో ప్రారంభిం చారు. జాతీయ పతాకాన్నీ డాక్టర్ గోగినేని వెంకట సుబ్బయ్య ఆవిష్కరించారు. 46ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న కలయికకు స్వాగతం పలుకుతూ పివిఎ పద్మనాభం కేకు కట్ చేశారు. విశ్రాంత ఎగ్జి ఎఇ కుందేటి సాయిబాబు స్కూల్ ఫోటో ఆవిష్కరించారు. చల్లా వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వ రరావు, తాజ్మహల్, రమేష్ నాయుడు పూర్వ విద్యార్థుల గుర్తులు, వారి సమాచారంతో రూపొందించిన సావనీరు ఆవిష్కరించారు. అనంతరం వారి సందేశాలు సభ ముందు ఉంచారు. అనంతరం పూర్వ విద్యార్థుల పరిచయ ప్రారంభమైంది. తేలప్రోలు వాసుదేవ మూర్తి తమ బాల్యం గుర్తులు ఆవిష్కరింప చేశారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు చందులూరి రామకోటేశ్వరరావు మనలను ప్రభావితం చేసి మార్గ నిర్దేశకులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల జ్ఞాపకాలు తెలియజేశారు. మేడతాటి



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వెంకటకృష్ణారావు పూర్వ విద్యార్థి ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందులూరి గురించి ప్రసంగించారు. అనంతరం ప్రణవానంద తన ప్రసంగంలో గురువందనాన్ని వివరించారు. పలు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. తెలుగు సినీ దర్శకులు, నటులు పురం రాధాకృష్ణ ఈ పాఠశాల పూర్వ విద్యార్థి కావటం విశేషం. ఉదయం నుండి సాయంత్రం 5గంటల వరకు పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక, ఆట, పాటలతో పాఠశాల ఆవరణ కోలాహలంగా మారింది. కార్యక్రమాలను తూనుగుంట్ల రమేష్, తూనుగుంట్ల మల్లికార్జునరావు (చినబాబు), పెనుమర్తి పద్మనాభం, చందులూరి రామకోటేశ్వరరావు, అన్నవరపు సుబ్బారావు, మాచర్ల నాగేశ్వరరావు, ఆకురాతి కోటి నాగులు, తేలప్రోలు వాసుదేవ మూర్తి పర్యవేక్షించారు.

క్రీస్తు మార్గంలో ప్రజలకు మంచి చేస్తున్నాం..

ప్రజాశక్తి - అద్దంకి

ప్రజలకు మంచి చేయడమే అసలైన క్రీస్తు మార్గమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. కట్టక్రిందపాలెం సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ లో ఆదివారం జరిగిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో రాష్ట్రాభివృ ద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నాగార్జున సాగర్ కాలువను బాగుచేసి 20ఏళ్ల తరువాత సాగర్ కాలువ కింద పొలాలకు నీరు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. క్రీస్తు మార్గం అనుసరించి ప్రజలకు మంచి చేయడానికి ఉన్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటున్నామని అన్నారు. కుల, మాతాల మధ్య గొడవలు సృష్టించేందుకు సైతానులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజలందరూ క్రిస్మస్ పండుగ సంతోషంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కోరిక మేరకు అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో అన్ని వ్యవస్థల్నీ ధ్వంసం చేసిన వైసీపీ నేతలు, గ్రామీణ ప్రాంతాల రోడ్లను బాగు చేయించ లేదని అన్నారు. నియోజకవర్గంలో 3సబ్ స్టేషన్లు నిర్మిస్తుం డటంతో పాటు 2వేల కొత్త స్థంబాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖను ఆదాయ వనరుగా చూడవద్దని చెప్పిన మాటలు గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగాలో ఓల్టేజ్ సమస్య ఎదురు కాకుం డా అన్ని ప్రాంతాల్లోనూ సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామని తెలి పారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని ఆరోపించారు. వాళ్ల పత్రికలో ప్రభుత్వం చేస్తున్న మంచిని కూడా చెడుగా చూపుతున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచితే తాము వచ్చిన తరువాత ట్రూ డౌన్ కింద 13 పైసలు తగ్గించిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ నేతలు చేస్తున్న విష ప్రచారం పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సూర్యఘర్ వంటి పథకాలతో అన్ని వర్గాలకూ ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

తెరమరుగవుతున్న నాటక రంగాన్ని రక్షించాలి

భావపురి కళా వేదిక అధ్యక్షులు మురళీకృష్ణ

ప్రజాశక్తి - బాపట్ల

తెర మరుగవుతున్న నాటకరంగాని పూర్వవైభవం కల్పించి రంగస్థలం నాటకాల్లోని సందేశాలు, సృజనాత్మ కతను భావితరాలకు తెలియజేయాలని భావపురి కళావేదిక అధ్యక్షులు ఇమ్మడిశెట్టి మురళీకృష్ణ అన్నారు. భావపురి కళావేదిక ఆధ్వర్యంలో ప్రథమ నాటక ప్రదర్శన సందర్భంగా పట్టణంలో రథం బజారులో ఆదివారం ఏర్పాటు చేసిన వేదికపై నాటక ప్రదర్శనల సందర్భంగా ఆయన మాట్లాడారు. పౌరాణిక నాటకాల్లో ని ఇతివృత్తాలు సందేశాత్మకమైన భాషా పరిజ్ఞానాన్ని రానున్న తరాలు అందించేందుకు నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రభుత్వాలు సైతం రంగస్థల నాటకాలు ప్రోత్సహిం చాలని అన్నారు. గతంలో నాటక రంగాన్ని నమ్ముకున్న కళాకారులు రంగస్థలం నాటకాలకు ప్రోత్సాహం లేక తెరమరుగు అవుతున్నారని అన్నారు. నేటి తరానికి నాటి రంగస్థల అభినయం, ఆహార్యం, వస్త్రాలంకరణ, రంగాలంకరణ వంటి కళల విశిష్టత ప్రత్యక్షంగా తెలియజేయాలని అన్నారు. రంగస్థల నాటక రక్షణకు ప్రభుత్వ చేయూత, మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. నంది నాటకోత్సవాల వంటి ప్రోత్సాహకాలు నిర్వహించి, రిహార్సల్ వేదికలు, ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరారు. ఇందుకోసం



రామాంజనేయ యుద్ధం నాటకంలో ఓ సన్నివేశం

ప్రత్యేకంగా మండల కేంద్రాల్లో కళావేదికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికంగా సృజనాత్మకత, హృద్యమైన రచనలు, దర్శకత్వం ద్వారా నాటకాలు జనరంజకంగా పుంజుకుంటాయని అన్నారు. ప్రభుత్వంతో పాటు రంగస్థలం నాటక రంగాన్ని పరిరక్షించేందుకు పోషకులుగా పరిషత్తులు, ప్రజల ప్రోత్సాహంతో రంగస్థల నాటక రంగం తిరిగి జీవం పోసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా రామాంజనేయ యుద్ధం (వార్ సీను), శ్రీకృష్ణ తులాభారం (పాన్పు సీను), సత్య హరిచంద్ర నాటకంలో (వారణాసి, కాటిసీను) ప్రదర్శించారు. కార్యక్రమంలో నాటక అకాడమీ డైరెక్టర్ మందపాటి ఆంధ్రేయ, భావపురి కళావేదిక కార్యదర్శి ఎస్ ఏడుకొండలు, ఉపాధ్యక్షులు కుక్కల రామిరెడ్డి పాల్గొన్నారు.

పొలం గట్టు వివాదంలో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - అద్దంకి


మండలంలోని మోదేపల్లికి చెందిన మేదరమెట్ల అంజయ్య వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తు న్నాడు. ఈ క్రమంలో తన మేనమామ కుమారుడైన నల్లపనేని రామాంజనేయులు ప్రక్కనే ఉన్న కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఇక్కడ సరిహద్దు గట్లు సరిచేస్తున్న అంజయ్యను నల్లపునేని రామాంజనేయులు, అతని కుమారుడు శ్రీకాంత్, వెంకటేష్ వచ్చి ఘర్షణకు దిగారు. ముగ్గురు కలిసి అంజియ్యపై దాడి చేయగా రక్త గాయాలయ్యా యని స్థానిక పోలీసు స్టేషన్లో బాధితుడు అంజయ్య ఫిర్యాదు చేయగా ఎఎస్ఐ జెవివి నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

మద్యం, సిగరెట్‌కు బలి కావొద్దని 'ఫ్లెక్సీ'

పెద్ద కర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన బంధువులు

ప్రజాశక్తి - బాపట్ల

నాలాగా సిగరెట్, మద్యానికి ఎవరు బలి కావద్దని, నా పెద్ద కర్మ రోజు వేసే ఫ్లెక్సీలపై ప్రజలకు తెలిసే విధంగా వేయించి, కూడలి ప్రాంతాల్లో కట్టి తన చివరి కోరిక తీర్చండని పట్టణంలోని రైలుపేటకు చెందిన పడమటి శరత్ బాబు చనిపోయే ముందు చివరిగా చెప్పిన మాటలను ఆయన కుటుంబ సభ్యులు గుర్తు చేసుకున్నారు. శరత్ బాబు పెద్దకర్మ సందర్భంగా ఆయన కోరిన విధంగా ఆదివారం ఫ్లెక్సీలు వేయించి కట్టించారు. తన అకాల మరణం భార్యా, బిడ్డలకు తీరని లోటు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తీరని వేదన, కుటుంబ భవిష్యత్తును దూరం చేసే మద్యం తాగి, సిగరెట్లు కాల్చడం వల్లే తాను చనిపోతున్నానని చెప్పిన మాటలు కుటుంబ సభ్యులను మరింత బాధకు గురిచేస్తున్నాయి. దీంతో మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలని ఫ్లెక్సీలు వేయించి అనేక చోట్ల ఏర్పాటు చేశారు. అతిగా మద్యం సేవించి సిగరెట్లు కాల్చడం వల్లే తన మరణాన్ని కోల్పోతున్నాననే బాధతో శరత్ బాబు కన్నుమూశారని బంధువులు తెలిపారు. అతనిలాగా మద్యం, సిగరెట్‌తో



మద్యం, సిగరెట్ తాగొద్దని ఏర్పాటు చేసిన పెద్దకర్మ ఫ్లెక్సీ

ఎవరు ప్రాణాలు కోల్పోయి కుటుంబానికి శోకాన్ని మిగిలిచ్చవద్దని అతని కుటుంబ సభ్యులు కోరారు. ఈ సందేశం కొందరికైనా కనువిప్పు కలిగిస్తుందని ఆశిద్దాం.



మాట్లాడుతున్న బాచిన చెంచు గరటయ్య

19 నుండి రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలు

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 19 నుండి 21 వరకు పంగులూరులో రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖో ఖో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాచిన చెంచు గరటయ్య చెప్పారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల క్రీడా ప్రాంగ ణంలో 44వ జూనియర్ బాల బాలికల (అండర్ 18) రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలు వైభవంగా జరగనున్నాయని అన్నా రు. గ్రామస్తుల సహకారంతో రాత్రి, పగలు ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలకు వచ్చే క్రీడాకారులు, అతిథులు, కోచ్‌లు, మేనేజర్లు, సెక్రటరీలు, ప్రెసిడెంట్లు, వాలంటీర్లు మొత్తం వెయ్యి మంది వరకు ఉంటారని అన్నారు. వీరందరికీ భోజన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. పోటీలకు హాజరయ్యే బాలురకు స్థానిక కళాశాల క్యాంపస్‌లో వసతి కల్పిస్తున్నామని, బాలికలకు గ్రామస్తుల వసతి గృహాలు, కోచ్‌లు, మేనేజర్లకు స్థానిక చర్చి క్యాంపస్, అతిథులకు గ్రామస్తుల వసతి గృహాలు, రోటరీ క్లబ్‌లో కల్పిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి ఖో ఖో పోటీల్లో పాల్గొంటారని ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు మేకల సీతారాంరెడ్డి తెలిపారు. భోజన సౌకర్యాన్ని స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్య దర్శి కె హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు వసంత రఘు బాబు, గ్రామ పెద్దలు ఇమ్మడిశెట్టి సుబ్బారావు, రాయిని విశ్వే శ్వరరావు, బాచిన చౌదరి బాబు, బాచిన నాగార్జున, రాయిని వెంకట సుబ్బారావు, తెలుగుదేశం మండల అధ్యక్షులు రావూరు రమేష్ బాబు, రావూరి రంగారావు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎన్‌ఆర్‌ఐ వైద్య కాలేజీ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెసర్లంక డికె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండె, కిడ్నీ, నడుము, వెన్నుపూస సంబంధిత వ్యాధులు, జనరల్ మెడిసిన్, చిన్నపిల్లలు, ఈఎన్టీ, కళ్ళు, గైనకాలజీ, జనరల్ సర్జరీ, కీళ్ళు, ఎముకలు, చర్మ సంబంధిత వ్యాధులకు వైద్య చికిత్సలు అందించారు. శిబిరాన్ని గ్రామ ప్రజలతో కలిసి ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధనరావు ప్రారంభించారు. 120 మంది వైద్యులు, 200 మంది సిబ్బందితో కలిసి ఏర్పాటు చేసిన క్యాంపులో 1200 మందికి వైద్య సేవలు అందించారు. ఈసీజీ, కార్డియాక్ ఎకో, అల్ట్రాసౌండ్, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో ఏర్పాటు చేసిన శిబిరం విజయవంతంగా ముగిసిందని తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ లక్ష్మీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమార్ చౌదరి, సీనియర్ రేడియాలజిస్ట్ డాక్టర్ అంకమరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

సేవల్లో డిజెఆర్ ట్రస్ట్ ముందంజ

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు • ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో డిజెఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడు ముందంజలో ఉంటుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పేర్కొన్నారు. స్థానిక సంతపేట సాయిబాబా దేవస్థానంలో డిజెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు 1500 మందికి ఉచిత కంటి పరీక్షలు జరిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో అవసరమైన వారికి మందులు, ఉచిత కళ్లజోళ్లు ఎమ్మెల్యే దామచర్ల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిజేఆర్ ట్రస్ట్ ద్వారా ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. పేదలకు సేవ చేయడంలో ట్రస్ట్ ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. ఉచిత వైద్య శిబిరంలో చూపించుకున్న వారికి, కంటి శుక్లాలు నిర్ధారించబడిన వారికి ఎన్టీఆర్ వైద్యసేవ కార్డ్ ద్వారా ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల సతీమణి నాగసత్యలత, కుమార్తె అనీషా లక్ష్మీ, డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సాయి యశ్వంత్, డాక్టర్ లక్ష్మీ శిరీష, వి జయకుమార్‌రెడ్డి, దేవస్థానం నిర్వాహకులు అలహరి చెంచలరావు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



కార్నివాల్‌లో విద్యార్థులతో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

'కార్నివాల్'ను ఆదర్శంగా తీసుకోవాలి

- విద్యార్థులకు ఆర్థిక చేయూత అభినందనీయం
- ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్
- నెక్ట్ జెన్ ఇంటర్నేషన్ స్కూల్లో ఆకట్టుకున్న 'కార్నివాల్' స్టాల్స్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కార్నివాల్ కార్యక్రమాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు పిలుపునిచ్చారు. ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు సమీపంలోని నెక్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో 'కార్నివాల్' కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరితంగా జరిగింది. ఇందులో నెక్ట్ జన్ విద్యార్థులే కాక ఇతర స్కూళ్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ నెక్ట్ జెన్ స్కూల్లో కార్నివాల్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ స్కూల్లో నాలుగోసారి ఈ కార్యక్రమం జరపడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తాను కూడా ఒకసారి కార్నివాల్ కార్యక్రమం ఎలా ఉటుంటుందో చూశానని, కొన్ని వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇందులో పాల్గొన్నారన్నారు. ఇందులో వచ్చే ఆదాయాన్ని అనాథ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు, పేద విద్యార్థులు చదువులకు ఉపయోగించాలని నిర్వాహకులు సంకల్పించుకోవడం ఆనందకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లల్లో సామాజిక బాధ్యత పెరుగుతుందని, అందరూ ఆదర్శంగా తీసుకుంటారని ఆశిస్తున్నానన్నారు. కేవలం స్కూళ్లల్లో చదువుకోవడమే కాకుండా ఇలాంటి పనులు చేయడం వల్ల వారికి మంచి బాధ్యత తెలుస్తుందని. ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న నెక్ట్ జెన్ స్కూల్ డైరెక్టర్స్ డాక్టర్ మురళీధర్‌రెడ్డి, కె శ్రీకాంత్‌బాబు, అరవింద, శ్రీవిద్య, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ఎల్‌వి రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను స్కూల్ నిర్వహకులు ఘనంగా సత్కరించారు. దామచర్ల వెంట నగర అధ్యక్ష బండారు మదన్, టిడిపి నాయకులు ఉన్నారు.

విద్యార్థుల అభ్యున్నతే 'సమగ్ర శిక్ష' లక్ష్యం

- నూరు శాతం ఫలితాల సాధనకై ప్రణాళికలు...
- విద్యా వనరుల ద్వారా ప్రతి ఒక్కరూ రాణించాలి..
- అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ అనిల్‌కుమార్ దాసరి


అనిల్‌కుమార్ దాసరి

ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా సమగ్ర శిక్ష పథకం కీలక మైలురాయిగా నిలుస్తోందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో అమలవు తున్న ఈ పథకం ద్వారా బాల్య స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా జిల్లా సమగ్ర శిక్ష శాఖను ముందుకు తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ అనిల్ కుమార్ దాసరి స్పష్టం చేశారు. ఉన్నత విద్యాశాఖలో పని చేసిన అనుభవంతో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం సమగ్రశిక్ష పథకం ద్వారా ప్రతి విద్యార్థి భవితను తీర్చి దిద్దేందుకు నూరు శాతం ఫలితాలు సాధన దిశగా ప్రణాళికలు రూపొంది స్తున్నట్లు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖముఖి.. ఆయన మాటల్లోనే..

విద్య 'సమాజ పురోగతి'ని నిర్దేశించే శక్తి..

విద్య అనేది కేవలం పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాదు, అది వ్యక్తి భవిష్యత్తును, సమాజ పురోగతిని నిర్దేశించే శక్తిగా గుర్తించిన ప్రభుత్వం సర్వశిక్ష ద్వారా విద్యాభివృద్ధికి కీలకమైన మార్పులు చేపట్టింది. ఉన్నత ప్రమాణాలతో కూడిన రెసిడెన్షియల్ స్థాయి విద్య అమలు చేస్తోంది. జిల్లాలో కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారుల సహకారంతో సమగ్ర శిక్ష కార్యక్రమాలు సమర్థవంతంగా అమలుకు క్షేత్ర స్థాయిలో (కేజీబీవీ) విస్తృత పర్యటనలు చేపట్టడం సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

పాఠశాల మౌలిక వసతులతో గుణాత్మక మార్పు..

ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వనరుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాము. 'మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం' ద్వారా నూతన తరగతి గదుల నిర్మాణం, పాత భవనాల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నిచర్ వంటి వసతులు సమకూర్చడం ద్వారా విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకర మైన అభ్యాస వాతావరణం కల్పిస్తున్నాము. ఈ మార్పులు కేవలం భౌతిక సదుపాయాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో పాఠశాల విద్యపై ఆసక్తి పెరిగేలా, హాజరు శాతం మెరుగుపడేలా చర్యలు చేపట్టాము.

ఎఫ్ఎల్ఎన్ - బలమైన పునాది..

ప్రాథమిక విద్యే విద్యా వ్యవస్థకు పునాది అన్న భావనతో ఈ ఏడాది ఫౌండేషన్ లిటరసీ అండ్ నుమరసి (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నాము. ఈ ప్రక్రియ ప్రతి ప్రైమరీ విద్యార్థి తన తరగతి స్థాయికి తగిన రీతిలో చదవడం, రాయడం, లెక్కించడం, నైపుణ్యాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాము. ఇప్పటికే జిల్లాలోని 79,044 మంది ప్రాథమిక విద్యార్థులకు ప్రారంభ సామర్థ్య స్థాయి పరీక్షలు నిర్వహించి 75 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నాము. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం అంచనా వేసి, అవసరమైన చోట అదనపు బోధన, రీమిడియల్ టీచింగ్ అందిస్తున్నాం. దీని ఫలితంగా ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యాస ఫలితాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. జిల్లాలోని 822 స్కూల్స్‌కు 'జదూయి పిటారా కిట్' లను అందించి విద్యార్థి మరింత సులభంగా చదువుకునేలా చర్యలు చేపట్టాం.

ఉపాధ్యాయుల సామర్థ్యాభివృద్ధే విద్యా నాణ్యతకు ప్రామాణికం..

ఉపాధ్యాయులే విద్యా వ్యవస్థకు ప్రాణం అన్న దృఢ నమ్మకంతో, సమగ్ర శిక్ష కింద నిరంతర వృత్తి అభివృద్ధి శిక్షణా కార్య క్రమాలు నిర్వహి స్తున్నారు. నూతన బోధనా పద్ధతులు, ఐఎఫ్‌పి ప్యానెల్స్ ద్వారా విద్యార్థి కేంద్రిత బోధన, మరియు అభ్యాస ఫలితాల ఆధారిత బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాము. దీనిలో భాగంగా జిల్లాలోని 23 'అటల్ టింకరింగ్ ల్యాబ్'లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు ఉపయోగపడేలా వర్క్‌షాప్స్ నిర్వహించాము.

డిజిటల్ విద్యతో ఆధునిక అభ్యాసం..

విద్యను సాంకేతికతతో అనుసంధానం చేస్తూ డిజిటల్ విద్యకు పెద్దపీట వేస్తున్నాం. స్మార్ట్ క్లాస్‌రూములు, డిజిటల్ కంటెంట్, వీడియో ఆధారిత బోధన, బోధన-అభ్యాస సామగ్రి (టిఎల్ఎం) వినియోగం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి, సృజనాత్మకత పెరుగుతుంది. 'పాల్' (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) అనే కొత్త విధానం ద్వారా జిల్లాలో 91 పాఠశాలల్లో 'పాల్ ల్యాబ్'లు ఏర్పాటు చేసి ఒక్కో ల్యాబ్‌లో 30 టాబ్‌ల ద్వారా విద్యార్థులు ఇంగ్లీష్, మ్యాథ్స్‌ను మరింత సులభంగా నేర్చుకునేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాము.

బాలికల విద్యకు ప్రోత్సాహం..

కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు), బాలికల హాస్టల్స్ ద్వారా బాలికల డ్రాప్‌అవుట్ తగ్గింపు చర్యలు చేపట్టాము. జిల్లాలోని 28 టైప్ 3 కేజీబీవీలలో ఈ సంవత్సరం మొత్తం 6,999 మంది బాలికలు సురక్షితంగా చదువుతున్నారు. వారిలో 1,077 మంది 10వ తరగతి విద్యార్థులు. ఈసారి కేజీబీవీల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటికే చర్యలు చేపట్టాము. మొత్తం 10 టైపు 4 కేజీబీవీలలో ఇప్పటికే 8 ప్రారంభించాము. మిగిలిన రెండింటినీ ఈ నెలలో ప్రారంభించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాము. ప్రభుత్వం యొక్క నూరు రోజుల ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రత్యేక సేవలు..

సమగ్ర శిక్ష పథకంలో ప్రత్యేక అవసరాలు పిల్లల (సిడబ్ల్యూఎస్ఎన్) విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నాం. వీరికి అవసరమైన సహాయక పరికరాలు, థెరపీలు, ప్రత్యేక శిక్షణ, అకడమిక్ మద్దతు అందిస్తున్నాం. సమాజంలో వారిని ప్రధాన దారిలోకి తీసుకురావడమే ఈ కార్యక్రమాల లక్ష్యం. కాగా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌ల ద్వారా ఉచిత బ్యాగ్, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. దీని వల్ల పాఠశాలల్లో హాజరు శాతం పెరగడంతో పాటు, మధ్యలో బడి మానేసే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది.

తల్లిదండ్రులు-పెద్దల భాగస్వామ్యం..

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీలు, స్థానిక సంస్థల భాగస్వామ్యాన్ని పెంచుతూ సమాజ భాగస్వామ్యంతో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నాము. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. సమగ్ర శిక్ష పథకం ద్వారా ప్రకాశం జిల్లాలో ప్రతి పిల్లవాడికి సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా జిల్లా సమగ్ర శిక్ష అధికారులు, ఉపాధ్యాయుల సమన్వయంతో కృషి కొనసాగుతుంది.

దారా అంజయ్యకు 'అంబేద్కర్ విశిష్ట సేవా రత్న' అవార్డు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాల మహానాడు (పివి రావు) ప్రకాశం జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్యను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశిష్ట సేవా రత్న అవార్డు వరించింది. గుంటూరు రూరల్ మండలం గొర్లవారిపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి మాలల ఆత్మీయ కలయికలో అంజయ్యకు నిర్వాహకులు ఈ అవార్డును ప్రదానం చేశారు. తాళ్లూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన దారా అంజయ్య రెండు దశాబ్దాలుగా సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారు. డైమండ్ సెక్యూరిటీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వందలాదిమంది నిరుద్యోగ యువతకు తన సంస్థ ద్వారా ఉపాధి కల్పించారు. మాల మహానాడు అధ్యక్షులుగా సమాజంలో దోపిడీకి, వివక్షకు, అన్యాయాలకు అవమానాలకు గురవుతున్న అణగారిన వర్గాలకు అండగా నిలబడ్డారు. వివాదరహితుడుగా పేరున్న దారా అంజయ్య తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామంలో, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాలల కమ్యూనిటీ హాలును, అన్నదాన సత్రాన్ని ప్రజల అండదండలతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఆయన సేవలను మెచ్చి, మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్ దారా అంజయ్యకు అంబేద్కర్ విశిష్ట సేవా రత్న అవార్డును బహూకరించారు. మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత, మాజీ ఎంపీ హర్షకుమార్, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జె విద్యాసాగర్‌లు దారా అంజయ్యను అభినందించారు.


దారా అంజయ్య